క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆదోని సెంట్రల్: రోడ్డుప్రమాదానికి గురైన స్పెక్ట్రమ్ కలర్ ల్యాబ్ ప్రింటర్ యాజమాని విజయ్ ఆనంద్‌కు ఫొటోగ్రఫీ అసోషియేషన్ సభ్యులు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చిన విజయ్ ఆనంద్‌ను కలిసి నగదును అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మహేష్, సభ్యులు రమణ, గోవిందరాజులు, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తలారి మృతి



యంకమ్మ (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని 104 బసాపురం తలారి యంకమ్మ(55) సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ తలారి మట్టి ఖర్చులకు రూ.15 వేలు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ జయరామ్‌రెడ్డి, వీఆర్వోలు, గ్రామసేవకుల డివిజన్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసులు, మండలాధ్యక్షులు టి.వెంకటేశులు, టి.కాశీం, టి.సిద్ధప్ప, నారాయణ, వీరేష్ తదితరులు యంకమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రంగస్థల కళాకారుడికి నివాళి



నివాళులర్పిస్తున్న రంగస్థల కళాకారుల సేవా సంఘం సభ్యులు

ఆదోని అర్బన్ : ప్రముఖ రంగస్థల కళాకారుడు జి.రాముడు మృతి బాధాకరమని రంగస్థల కళాకారుల సేవాసంస్థ అధ్యక్షుడు డా.జి.నల్లారెడ్డి అన్నారు. సోమవారం ఆదోనిలోని ఎమ్మిగనూరు టర్నింగ్ పాయింట్ సమీపంలోని రంగస్థల కళావేదికలో సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా జి.రాముడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాముడు పల్లెదొడ్డి గ్రామ సర్పంచ్‌గా రెండు సార్లు ఎన్నికై ప్రజలకు మంచి సేవలు అందించారన్నారు. రంగస్థల కళాకారుడిగా ప్రేక్షకుల మెప్పు పొందారన్నారు. కార్యక్రమంలో సంగీత మాస్టర్ అబ్దుల్లా, రంగస్థల కళాకారుడు రాయుడు, సాబ్, సుల్తాన్ ఉన్నారు.

తాగునీటి కోసం..



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బల్లేకల్ గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు

ఆదోని రూరల్ : మండలంలోని బల్లేకల్ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ మండల కార్యదర్శి వీరేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, డీవైఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ మాట్లాడుతూ బల్లేకల్ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని లేకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

రాఘవుడి సన్నిధిలో కర్ణాటక ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మంత్రాలయం రూరల్: రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక బెలగావీ జిల్లా రాయబాగ నియోజకవర్గం ఎమ్మెల్యే దుర్యోధన కుటుంబ సమేతంగా సోమవారం మంత్రాలయానికి వచ్చారు. గ్రామదేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పిండి వంటలతో స్వామికి నైవేద్యం సమర్పించారు.

సాగుకు సహకారం



ముళ్లపొదలు, పూడిక తీసిన అనంతరం కాల్వ ఇది

- నూగూరు రిజర్వాయర్ కాల్వలో పేరుకుపోయిన ముళ్లపొదలు, పూడిక తొలగింపు
- శాశ్వత పరిష్కారానికి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు
- సీసీ లైనింగ్ నిర్మాణానికి ప్రణాళికలు తయారు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాత

మంత్రాలయం రూరల్: సూగూరు మైనర్ ఇరిగేషన్ జలాశయంలో నీరు ఉన్నప్పటికీ కాల్వలో పేరుకుపోయిన ముళ్లపొదలు, పూడికతో సాగునీరు అరకొరగా అందేవి. ఏటా పూర్తిస్థాయిలో సాగునీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడేవారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వ్యవసాయానికి అవసరమైన నీరు ఆయకట్టుకు చేరడంలేదని తెలిపారు. రిజర్వాయర్ నిర్మించిన నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వం కాల్వలో నిండిపోయిన ముళ్ల పొదలను కూడా తొలగించలేదని రైతులు వాపోయారు. దీన్ని ఆలకించిన ఎమ్మెల్యే.. రైతుల భాగస్వామ్యంతో కాల్వలో పేరుకుపోయిన పూడిక, ముళ్లపొదల తొలగింపు పనులు చేపట్టాలని మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డిని ఆదేశించారు. నెల రోజుల క్రితం చేపట్టారు. మొత్తం 7 కిలోమీటర్ల కాల్వలో 4 కిలోమీటర్ల వరకు వాటిని తీయించి సాగునీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కాల్వను శుభ్రం చేయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ ప్రారంభించిన చెరువు..

ఎల్లెల్సీ కింద చివరి ఆయకట్టు అయిన వగరూరు, తిమ్మాపురం, బూదూరు, సూగూరు, మంత్రాలయం, కల్లుదేవకుంట, చిలకలడోణ, చెట్నేహళ్లి గ్రామాలకు సాగునీరు అందక రైతులు వర్షాధారంగా సాగుచేసే పరిస్థితి ఏర్పడింది. కరువు నేల కావడంతో రైతులు వలసబాట పట్టేవారు. దీన్ని గమనించిన అప్పగి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం జలయజ్ఞం పథకం కింద రూ.132 కోట్లతో గురురాఘవేంద్ర ప్రాజెక్టును చేపట్టారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లోని ఆయకట్టుకు తుంగభద్ర నది నుంచి వరద నీటిని చెరువుల్లోకి ఎత్తిపోసి సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగా మూడు నియోజకవర్గాల్లో సాగునీటి కోసం చెరువులను నిర్మించారు. నది నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. మంత్రాలయం మండలం వగరూరు గ్రామం వద్ద సూగూరు మైనర్ ఇరిగేషన్ చెరువును రూ.12 కోట్లతో 94 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. దీన్ని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2006లో ప్రారంభించారు. ఈ చెరువు కింద వగరూరు, తిమ్మాపురం, బూదూరు, సూగూరు, మంత్రాలయం, కల్లుదేవకుంట, చిలకలడోణ, చెట్నేహళ్లి గ్రామాలను ఆయకట్టు కింద చేర్చి 3 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ ఫలాలు నేటికీ అందుతున్నాయి. ఎల్లెల్సీని అనుసంధానించి ఏడు కిలోమీటర్ల కాల్వను నిర్మించారు.



సూగూరు జలాశయం

పట్టించుకోని ప్రభుత్వాలు..

నాడు రాజశేఖర్‌రెడ్డి రైతుల కోసం చేపట్టిన చెరువు నిర్వహణను ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాల్వలు ముళ్లపొదలతో నిండిపోవడం, పూడిక పేరుకుపోవడంతో కనీసం వగరూరు, తిమ్మాపురం, బూదూరు గ్రామాలకు సాగునీరు అందేవి కావు. పైగా వగరూరు వద్ద తరచూ కాల్వకు గండి పడేది. చెరువుకూ గండి పడేది. వైఎస్ఆర్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చెరువు ఆయకట్టు రైతులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తున్నారు. రెండేళ్ల క్రితం చెరువుకు గండిపడటంతో స్పందించిన ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని అధికారులతో తక్షణమే పూడ్చివేయించారు. కాల్వ సమస్యను విన్న ఎమ్మెల్యే ముళ్లపొదలు, పూడికను తీయించి మరోసారి రైతుల పట్ల తన అంకితభావాన్ని చాటుకున్నారు. శాశ్వతంగా రైతులకు ఇబ్బంది కలగకుండా కాల్వను సీసీ లైనింగ్ వేయాలని అందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారుల బృందం గ్రామంలో పర్యటించి సీసీ లైనింగ్ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇన్నాళ్లకు కాలువ శుభ్రమైంది.



కాల్వ కింద పది ఎకరాల భూమి ఉంది. ఏటా ఖరీఫ్, రబీల్లో సాగునీరు సక్రమంగా అందేవి కావు. ముళ్ల పొదలు, పూడిక పేరుకుపోవడంతో నీటిని మళ్లించడం కష్టంగా ఉండేది. నీటిని తోడుకునేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చేది. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో కాల్వలో పూడిక తీయించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– వీరారెడ్డి, వి.తిమ్మాపురం సర్పంచి, ఆయకట్టు రైతు

పనులు పూర్తిచేశాం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రెండు గ్రామాల్లో పర్యటించినప్పుడు కాల్వను బాగుచేయాలని రైతులు కోరడంతో ఆయన ఆదేశాలతో ముళ్ల పొదలు తొలగించడం, పూడికను తీయడం జరిగింది. రైతులు 20 శాతం ఖర్చు పెట్టుకోగా మిగిలినది ఎమ్మెల్యే సొంతంగా భరించారు. శాశ్వత పరిష్కారానికి సీసీ లైనింగ్ నిర్మించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. త్వరలోనే ప్రణాళికలు పూర్తిచేసి సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులకు మేలు చేయాలని ఎమ్మెల్యే యోచిస్తున్నారు.

– విశ్వనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్, ఆయకట్టు రైతు

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- అధికారులకు సబ్‌కలెక్టర్ ఆదేశం

ఆదోని రూరల్: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని, ఈ విషయంలో ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి ప్రజలు అర్జీలు తీసుకొచ్చి సబ్‌కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ సహాయకులు రామయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్ ప్రియ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

యువత క్రీడల్లో రాణించాలి

మంత్రాలయం: యువత క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి సూచించారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన ఫుట్‌బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన తుంగభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టును సోమవారం మండల పరిధిలోని రాంపురంలో వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి అభినందించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



యువతను అభినందిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఆదోని టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులకు మునిసిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం చేపట్టారు. వివిధ వార్డులకు చెందిన ప్రజలు ఆయనకు వినతులు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, టీపీఓ, విద్యుత్‌శాఖ, జనన మరణ, వాటర్ వర్క్స్, శానిటేషన్ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలో అధిక ధరలకు పుస్తకాలను విక్రయించడమే గాక తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజు వసూలు చేస్తున్న జీనియస్ గ్లోబుల్, వైష్ణవి పాఠశాలలను తక్షణమే మూసివేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు విద్యాధికారులు మోయినుద్దీన్, రాఘన్నలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేసి అధిక ఫీజు వసూలు చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్యాణ్, జయరాజు, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలని సోమవారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు, మహిళా హక్కుల సంఘం నాయకురాలు శ్రీలక్ష్మి వినతి పత్రం అందజేశారు. నిజమైన విలేకరుల కంటే నకిలీ విలేకరులు ఎక్కువయ్యారని, బైకులపై ప్రెస్ స్టిక్కర్ రాయించుకుని, బెదిరింపులకు పాల్పడుతూ, అక్రమ అర్జనకు తెరలేపుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి

మంత్రాలయం: ముస్లింలు ప్రశాంత వాతావరణంలో బక్రీద్‌ను జరుపుకోవాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలతో కలిసి సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదర భావంతో మెలగాలన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ముస్లింలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

పాఠశాలకు పంపండి

పెద్దకడబూరు: క్రమం తప్పకుండా పిల్లలను పాఠశాలకు పంపాలని మండల విద్యాధికారి రామమూర్తి సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తల్లిదండ్రులు రోజూ బడికి పంపాలన్నారు. అమ్మ ఒడి పథకం పొందాలంటే విద్యార్థి 75 శాతం హాజరు నమోదు కావాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, కమిటీ చైర్మన్ అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల విద్యాధికారి రామమూర్తి

అద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందుకున్న వారితో నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని చూడి గ్రామానికి చెందిన కంటి ఆపరేషన్ చేసుకున్న వారికి మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సొంత ఖర్చుతో కళ్ల అద్దాలను అందజేసినట్లు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, ఎంపీటీసీ వీరేష్, వీరభద్రగౌడ్, బసవరాజ్‌గౌడ్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన పలువురు కర్నూలులోని అమీలియా ఆసుపత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. అందులో 34 మంది కంటి ఆపరేషన్లు చేయించుకోగా వారికి ఎమ్మెల్యే సహకారంతో కళ్ల అద్దాలు అందజేసినట్లు తెలిపారు.

ఖాతాల్లో నగదు మాయం

- లబోదిబోమంటున్న బాధితులు
- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని మేనేజర్లు

కోసిగి: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌ల ఖాతాల్లో నగదు మాయమవుతోంది. బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా ఆయా బ్యాంక్‌ల బ్రాంచ్ మేనేజర్లు తమకు సంబంధం లేదన్నట్లు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన ఉప్పర మల్లికార్జునకు స్టేట్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. అతని ఖాతా నుంచి ఈనెల 19న రూ.10 వేలు, 22న రూ.2 వేలు, 25న రూ.4 వేలు మాయమైంది. ఇదే విషయాన్ని సోమవారం బ్రాంచ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధితుడు ఆరోపించాడు. కాగా ఇదే మల్లికార్జునకు గ్రామీణ బ్యాంక్ ఖాతా కూడా ఉంది. ఈ ఖాతా నుంచి 19వ తేదీన రూ.2 వేలు, 22వ తేదీన రూ.500 విత్ డ్రాచేశారని బాధితుడు వాపోయాడు. అలాగే సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన జె.రుద్రమ్మ డిసెంబర్‌లో పొలం విక్రయించగా వచ్చిన రూ.5 లక్షల నగదును స్టేట్ బ్యాంక్ ఖాతాలో దాచుకుంది. ఆమె ఖాతా నుంచి జనవరి 23 నుంచి మే 17వ తేదీ వరకు రోజు వారిగా రూ.10 వేల చొప్పున రూ.3.20 లక్షలను వేరే ఖాతాలకు బదిలీ చేసినట్లు బాధితురాలు బ్యాంక్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే ఖాతాను బ్లాక్ చేసిన బ్యాంక్ అధికారులు నగదు ఎవరు డ్రా చేశారో మాత్రం చెప్పలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మాత్రం ఉచిత సలహా ఇచ్చి పంపారు. బాధితురాలు బంధువులతో కలిసి పదిరోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇంతవరకు అతీగతీ లేదు. మరో వ్యక్తి కోసిగికి చెందిన రంగస్వామి స్టేట్ బ్యాంక్ ఖాతాలోని ఏప్రిల్ 6, 7, 8, 9వ తేదీలలో రోజుకు రూ.10 వేల చొప్పున రూ.40 వేలు, గ్రామీణ బ్యాంక్ ఖాతా నుంచి రూ.5 వేలు మాయమైంది. ఇతడు కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఫలితం లేదు. ఇలాంటి బాధితులు ఇంకా చాలామంది ఉన్నట్లు సమాచారం. అయినా బ్యాంక్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై ఖాతాదారులు మండిపడుతున్నారు. ఇదే విషయమై స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ అనిల్ కుమార్‌ను వివరణ కోరగా ప్రైవేట్ యాప్‌లు వినియోగిస్తుండటంతోనే నగదు మాయమై ఉంటుందని, అందుకు తాము బాధ్యులము కాదని చెప్పుకోచ్చారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



ఆదోనిలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ రమణారెడ్డి



కోసిగి వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు, అధికారులు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ రమణారెడ్డి యువతకు సూచించారు. సోమవారం స్థానిక భీమిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌డీపీఎస్ చట్టంపై ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డీఎస్పీ శివనారాయణస్వామి మాట్లాడుతూ చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివకుమార్‌స్వామి, లోకేష్, ఇన్‌స్పెక్టర్ ఎస్ఐ విజయలక్ష్మి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

- **మంత్రాలయం:** యువత మత్తుకు బానిస కాకుడదని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి రాఘవేంద్రసర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రసర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని హెచ్చరించారు.
- **కౌతాళం:** యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.
- **కోసిగి:** డ్రగ్స్ వాడకం ప్రాణాంతకమని, ప్రతి ఒక్కరు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సీఐ ఏరిసావలి, ఎస్ఐ రాజారెడ్డి సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి పోలీసులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారం ఏర్పడి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.
- **ఆదోని అర్బన్ :** మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని డీఎస్పీ శివనారాయణస్వామి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పోలీసుశాఖ, సెబ్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిగుండా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం విద్యార్థులతో డీఎస్పీ ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ హరిక్రిష్ణ, సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్, నరసింహారాజు, పార్థసారథి, నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

మంత్రాలయం: మండల పరిధిలోని సూగూరు గ్రామంలో పొలం విషయంలో కురువ దేవేంద్రపై అదే గ్రామానికి చెందిన కురువ మల్లయ్యతో పాటు మరో ఇద్దరు మారెమ్మవ్వ గుడి వద్ద దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన కురువ దేవేంద్రను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్లయ్యతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం పోలీసులు తెలిపారు.

మనోభావాలను కాపాడాలి

ఆదోని అర్బన్ : గోవులను రక్షించి హిందూ మనోభావాలను కాపాడాలని గోరక్షదళ్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం నాయకుడు కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు గోవులను వధ చేయకుండా చూడాలన్నారు. గోవు హిందువుల ఆరాధ్యదైవమని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంత్, మణికంఠ, ఉరుకుందగౌడ్, శివ, అంజయ్, శ్రీకాంత్, రాహుల్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదోని రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్పందన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు అఖండ మాట్లాడుతూ విద్యాసంస్థలు తెరిచి నెల అవుతున్నా పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదన్నారు.

30న రాత పరీక్ష

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ శివారులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8వ తరగతి ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈనెల 30వ తేదీ రాత పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మార్కులను బట్టి ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

తహసీల్దారుపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు: హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న మంత్రాలయం తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా కార్యవర్గసభ్యుడు బొగ్గుల తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మంత్రాలయం మండలం చొళహళ్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 19/బి1ఏలో ముత్తమ్మకు 2.89 ఎకరాల డి.పట్టా పొలం ఉందన్నారు. సదరు భూమి వారసత్వంగా వచ్చిందని, ఆ కుటుంబమే ప్రస్తుతం సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే 1979లో అదే భూమిలో ఇంటి పట్టాలు ఇచ్చారని కొంతమంది ప్రజలు, రెవెన్యూ అధికారులు హైకోర్టుకు వెళ్లారని, అక్కడ నిరూపణ చేయలేక పోయారని చెప్పారు. అయినా పంట వేయకుండా ముత్తమ్మ కుటుంబాన్ని అడ్డుకుంటే పట్టాలు ఇస్తాననని తహసీల్దారు గ్రామస్తులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా తహసీల్దారు కోర్టు ఆదేశాలను అనుసరించి నడుచుకోవాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

ఆదోని సెంట్రల్: ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని ఎంపీడీఓ గీతావాణి, హౌసింగ్ డీఈ ఎం.రవి కుమార్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని కుప్పగల్, నాగలపురం గ్రామాల్లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను సోమవారం వారు పరిశీలించారు. మండల పరిధిలో 1,616 ఇళ్లు మంజూరుకాగా 455 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వారి వెంట హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

స్పందనలో వినతుల వెల్లువ

కోసిగి: తహసీల్దార్ రుద్రగౌడ సోమవారం తన కార్యాలయంలో స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దుద్ది గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 124లో 3.26 ఎకరాల ప్రభుత్వ పొలాన్ని ఇటీవల ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఆ పొలంలో నుంచి ఇతర పొలాలకు వెళ్లే రస్తాను బంద్ చేయడంతో రైతులు నాగేష్, రామిరెడ్డి, తాయన్న, ఈశ్వరయ్య, తిమ్మయ్య ఫిర్యాదు చేశారు. విచారించి రస్తా విడిపించాలని కోరారు. నేలకోసిగి పొలాల్లో సర్వే నంబర్ 51, 53లో ప్రభుత్వం ఇచ్చిన 47, 58, 59, 70, 170 నంబర్ ప్లాట్లను పక్కనే ఉన్న పొలం వ్యక్తి ఆక్రమించుకున్నాడని, విచారించి న్యాయం చేయాలని బాధితులు నూర్జహాజ్, షేకస్‌బీ, కొలిమి నూర్జహాన్, ఖాదర్ బీ, అబిబున్నీషా ఫిర్యాదు చేశారు. కోసిగిలో స్టేట్ బ్యాంక్ రెండో అంతస్తులో ఉండడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు గోపాల్ వినతి పత్రం ఇచ్చారు. విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.